సాక్షి
రాజన్న సిరిసిల్ల

బుధవారం ¦ 14 ¦ జూన్ ¦ 2023



బద్దిపోచమ్మకు బోనం

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి కల్లుసాక సమర్పించారు.



రక్తమిద్దాం.. ప్రాణం నిలుపుదాం

దాత ఇచ్చిన ఒక యూనిట్ రక్తం నలుగురికి ప్రాణం పోస్తుంది. రక్తదానం బాధితులకు దాతలకు మధ్య బంధాలను ఏర్పాటు చేస్తుంది. 8లో▸

గరిష్టం/కనిష్టం
41.0/30.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదవుతుంది. పగలు ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఫిట్‌నెస్ లేకుంటే సీజ్ చేస్తాం



తనిఖీ చేస్తున్న డీటీఓ కొండల్‌రావు

సిరిసిల్లక్రైం: పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ లేకుంటే సీజ్ చేస్తామని జిల్లా రవాణాశాఖ అధికారి వై.కొండల్‌రావు అన్నారు. మంగళవారం వివిధ పాఠశాలలకు చెందిన 5 బస్సులు తనిఖీ చేసి సీజ్ చేశామని వెల్లడించారు. ఇల్లంతకుంట మండలంలో రెండు, చందుర్తి, వేములవాడ, ఎల్లారెడ్డిపేట మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున సీజ్ చేశారు. ఫిట్‌నెస్ లేని వాహనాలకు రవాణా శాఖ కార్యాలయంలో రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. విద్యాసంస్థల బస్సులు 15 ఏళ్లు దాటితే ఎట్టి పరిస్థితుల్లో రోడ్లపై తిరగరాదన్నారు. స్కూల్ బస్సులను కండిషన్‌లో ఉంచడంతోపాటు అనుభవజ్ఞులైన డ్రైవర్లను నియమించుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా తనిఖీలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

తెలంగాణ సంస్కృతి గొప్పది



ముగ్గులు పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

ముస్తాబాద్(సిరిసిల్ల): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవని, తెలంగాణ ఉద్యమంలో మహిళల పాత్ర చాల కీలకంగా ఉందని ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతిని చాటుతూ మహిళలు వేసిన ముగ్గులను పోలీసులు పరిశీలించారు. ప్రతిభ చాటిన వారికి డీఎస్పీ చేతుల మీదుగా బహుమతులు అందజేసి సన్మానం చేశారు. సర్పంచ్ సుమతి, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మంజుల జానాబాయి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూమిపూజకు ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా బుధవారం జరిగే భూమిపూజ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ అనురాగ్ జయంతి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పరిశీలించారు. ఆలయ పునఃనిర్మాణ శంకుస్థాపనకు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి కేటీఆర్ హాజరవుతారు. టీటీడీ తరఫున నిర్మాణానికి రూ.1.80 కోట్లు మంజూరు చేయగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.1.20 కోట్ల మంజూరుకు అనుమతులు ఇచ్చింది. మొత్తం రూ.3 కోట్ల వ్యయంతో ఆధునికీకరిస్తుండగా ముఖ్యుల పర్యటనను పురస్కరించుకొని ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ జయంత్‌కుమార్, ఎంపీడీవో చిరంజీవి, సీఐ మొగిలి, సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ నంది కిషన్, సభ్యులు ఉన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా



చెత్తపడేసిన వ్యక్తికి జరిమానా రశీదు అందిస్తున్న కమిషనర్ సమ్మయ్య

సిరిసిల్లటౌన్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసిన వారిపై మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య కొరడా ఝుళిపించారు. మంగళవారం ఉదయం స్ట్రీక్‌వాక్‌లో భాగంగా స్థానిక మానేరు బ్రిడ్జి పరిసర ప్రాంతాల్లో చెత్తను పడేసినవారిపై సిబ్బందితో విచారణ జరిపించారు. స్థానిక గాంధీచౌక్‌లోని కావ్య బెంగుళూరు బేకరీ నిర్వాహకులుగా గుర్తించి వారికి రూ.10వేల జరిమానా విధించి వెంటనే పెనాల్టీ కట్టించారు. చెత్తరహిత పట్టణ స్ఫూర్తిని కాలరాసేవారిపై కఠిన చర్యలుంటాయలని కమిషనర్ పేర్కొన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.సత్యనారాయణ, ఉమర్, సుకుమార్ తదితరులున్నారు.

మెడికల్ కాలేజీ చకచకా

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ సిద్ధమైంది. జిల్లా వైద్యరంగంలో కొత్త అధ్యాయానికి తెర లేస్తోంది. సిరిసిల్ల పట్టణ శివారులోని పెద్దూరు బైపాస్ రోడ్డులో పదెకరాల్లో రూ.40కోట్లతో మెడికల్ కాలేజీ, విద్యార్థుల హాస్టళ్ల భవనాలు శరవేగంగా నిర్మాణమవుతున్నాయి. రాత్రి, పగలు రెండు షిఫ్ట్‌ల్లో పనులు చేయడంతో కళాశాల ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. జూలై రెండో వారంలోగా పనులు పూర్తి కానున్నాయి. ఈ ఏడాది నుంచే మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ వైద్య విద్య తరగతులు మొదలు కానున్నాయి.

- రాత్రి, పగలు భవన నిర్మాణ పనులు
- జూలై, ఆగస్ట్ నెలల్లో ఎంబీబీఎస్ అడ్మిషన్లు
- ఈ ఏడాది నుంచి వైద్య విద్య తరగతులు



సిరిసిల్ల శివారులోని పెద్దూరు వద్ద మెడికల్ కాలేజీ భవనం

పనులు వేగంగా సాగుతున్నాయి



మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. నెల రోజుల్లో భవనం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. వంద ఎంబీబీఎస్ సీట్లతో ఈ ఏడాది జూలై, ఆగస్ట్‌లో అడ్మిషన్లు జరుగుతాయి. సొంత భవనంలోనే విద్యాబోధన సాగుతుంది.

– డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్

కాలేజీకి లభించిన అనుమతులు

జిల్లా కేంద్రంలో వైద్య విద్యను బోధించే మెడికల్ కాలేజీని మంజూరు చేస్తూ నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) న్యూఢిల్లీ లెటర్ ఆఫ్ ఇన్‌టెంట్ (ఎల్ఓటీ) నం.ఎన్ఎంసీ/యూజీ/2023–2024/000033/021475 తేదీ: 21.04.2023ను జారీ చేసింది. కాలోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీకి వంద ఎంబీబీఎస్ సీట్లను కేటాయించారు. ఈ ఏడాది జూలై, ఆగస్ట్ నెలల్లో అడ్మిషన్లు జరుగనున్నాయి. ఈ మేరకు నేషనల్ మెడికల్ కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారికంగా కాలేజీకి అనుమతి లభించింది. 2021 జూలై 4న సీఎం కేసీఆర్ సిరిసిల్లకు మెడికల్ కాలేజీని ప్రకటించారు. సిరిసిల్ల ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కేటీఆర్ చొరవతో కాలేజీ భవన నిర్మాణానికి నిధుల కేటాయింపులు వేగంగా జరిగాయి. ఇప్పుడు భవన నిర్మాణం తుది దశకు చేరింది. జిల్లా ప్రజల చిరకాల వాంఛ సాకారమవుతోంది.

ఈ ఏడాది వంద సీట్లు

సిరిసిల్ల మెడికల్ కాలేజీలో మొదటి ఏడాది వంద సీట్లు కేటాయించారు. ఇందులో 15 సీట్లు ఆల్ ఇండియా కోటాలో కేటాయిస్తారు. మరో 85 సీట్లు మన రాష్ట్రస్థాయి అభ్యర్థులకు అవకాశం ఉంటుంది. 40 శాతం సీట్లు బాలురు, 60 శాతం బాలికలకు ఉంటాయి. జూలై నెలాఖరు నుంచి ఆగస్ట్ నెలలో కౌన్సెలింగ్ ఉంటుంది. ఆగస్ట్‌లోనే బోధన తరగతులు ప్రారంభిస్తారు. సిరిసిల్ల జిల్లా ఆస్పత్రిలో మొత్తం 340 బెడ్స్‌ను సిద్ధం చేశారు. పెద్దూరు వద్ద నిర్మించిన సొంత భవనంలోనే తరగతులు ప్రారంభిస్తారు. హాస్టల్ భవనాలు నిర్మాణంలో ఉండగా, బాలుర కోసం సుందరయ్యనగర్‌లోని ఎస్సీ హాస్టల్ భవనాన్ని సిద్ధం చేశారు. అమ్మాయిల కోసం ప్రైవేటు భవనాన్ని ఎంపిక చేశారు.

సిబ్బంది కేటాయింపు

సిరిసిల్ల మెడికల్ కాలేజీకి ప్రభుత్వం సిబ్బందిని కేటాయించింది. అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇతర సిబ్బంది కేటాయింపులు జరిగాయి. ఇప్పటికే 55 మంది సిబ్బందిని కేటాయించారు. కాలేజీ ప్రారంభమైతే సుమారు వంద మంది డాక్టర్లు అందుబాటులో ఉంటారు. మొత్తంగా మెడికల్ కాలేజీలో సుమారు 700 మంది సిబ్బంది అందుబాటులో ఉంటారు.

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

సిరిసిల్లలో మెడికల్ కాలేజీ ప్రారంభంతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు జరగనున్నాయి. పట్టణంలోని జిల్లా ఆస్పత్రిని పూర్తి స్థాయిలో మాతా శిశు సంరక్షణ, నవజాత శిశువుల కేంద్రంగా మారుతుంది. 340 బెడ్స్‌తో ప్రసూతి విభాగం అవుతుంది. ఇప్పటికే ప్రతినెలా 360 డెలివరీలతో సిరిసిల్ల జిల్లా ఆస్పత్రి అద్భుతమైన సేవలను అందిస్తుంది. జనరల్ ఆస్పత్రి మొత్తంగా మెడికల్ కాలేజీకి మార్చడంతో పెద్దూరు శివారులోని మెడికల్ కాలేజీ బోధన ఆస్పత్రిగా ఉంటుంది. అన్ని రకాల వైద్యసేవలు, ఆధునిక పరికరాలతో అందుబాటులోకి వస్తుంది. జిల్లా ప్రజలకు ఉచిత వైద్యసేవలు 24 గంటల బోధనాస్పత్రిలో అందుతాయి. ఏ ప్రైవేటు ఆస్పత్రిలో లేని విధంగా అన్ని రకాల డాక్టర్ల బృందం అందుబాటులో ఉండి సేవలు అందించనున్నారు.

నేడు సిరిసిల్లలో మంత్రి కేటీఆర్ పర్యటన



సిరిసిల్ల: సిరిసిల్ల నియోజకవర్గంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు బుధవారం పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు సిరిసిల్లలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో కలిసి శంకుస్థాపన చేస్తారు. 10.30 గంటలకు ఎల్లారెడ్డిపేటలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ పునఃనిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు ఎల్లారెడ్డిపేటలో కొర్రి అనిల్‌కుమార్ వివాహ వేడుకల్లో పాల్గొంటారు. 12.20 గంటలకు ఎల్లారెడ్డిపేటలో సుధాకర్ ఏర్పాటు చేసిన డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1 గంటకు సిరిసిల్లలో శ్రీనివాస్‌యాదవ్ పెళ్లి వేడుకల్లో భాగంగా మున్నూరు కాపు కల్యాణ మండపానికి వస్తారు. మధ్యాహ్నం 1.15 గంటలకు చేనేత వస్త్ర వ్యాపార సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి హాజరవుతారు. మధ్యాహ్నం 2.30 గంటలకు జిల్లా ఎస్పీ ఆఫీస్‌లో సీసీ కెమెరాలను ప్రారంభిస్తారు. 3 గంటలకు తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులో ఓల్డ్ ఏజ్ హోమ్‌ను ప్రారంభిస్తారు. ఈ మేరకు మంత్రి పర్యటనకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తుంది.

హెలీకాప్టర్‌లో రానున్న మంత్రి

సిరిసిల్ల: రాష్ట్ర మంత్రి కె.తారక రామారావు బుధవారం హెలికాప్టర్‌లో జిల్లాకు చేరుకుంటున్నారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ఉన్న హెలిప్యాడ్‌ను అధికారులు సిద్ధం చేశారు. మంత్రి శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నేపథ్యంలో ఆలయం వద్ద ఏర్పాట్లను కలెక్టర్ అనురాగ్ జయంతి, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, డీఆర్వో టి.శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, బీఆర్ఎస్ నాయకులు చీటి నర్సింగరావు, జిందం చక్రపాణి మంగళవారం సాయంత్రం పరిశీలించారు.

మహిళల సంక్షేమానికి బాటలు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ



కార్యక్రమానికి హాజరైన మహిళా అధికారులు, మహిళలు

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

సిరిసిల్ల: మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం బాటలు వేసిందని, ఆత్మగౌరవంతో బతికేలా పథకాలను అమలు చేసిందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సిరిసిల్ల పద్మనాయక కల్యాణ మండపంలో మంగళవారం మహిళా సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మార్కెట్ కమిటీ పదవుల్లో, ఇతర అన్ని రంగాల్లో మహిళలకు పెద్దపీట వేసి ప్రోత్సహించిన ఘనత సీఎం కేసీఆర్‌దన్నారు. ఒంటరి మహిళలు, బీడీ కార్మికులకు పెన్షన్లు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం మనదన్నారు. షీ టీమ్‌లను, సఖీ కేంద్రాలను పెట్టి మహిళల భద్రతకు బాటలు వేశారని గుర్తు చేశారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు మాట్లాడుతూ, మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా పెద్ద ఎత్తున రుణాలను అందిస్తూ, వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటును అందిస్తున్నారు. అనంతరం టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం మాట్లాడారు. ఎంపీపీలు పిల్లి రేణుక, వంగ కరుణ, జెడ్పీటీసీ కె.విజయ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరిత, కార్యదర్శి రజిత, ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యాలు

వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇల్లంతకుంట సెక్టార్ అంగన్‌వాడీ టీచర్ల నృత్యాలు అలరించాయి. జిల్లా సమాఖ్యకు రూ.16.78 కోట్ల రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఐసీడీఎస్ వారు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్ అలరించాయి.

మహిళల ఆత్మరక్షణకు 'జ్వాల'

- సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణకు జిల్లా పోలీస్‌శాఖ శ్రీకారం



జ్వాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, ఎస్పీ అఖిల్ మహాజన్ తదితరులు

సిరిసిల్లక్రైం: మహిళలు, విద్యార్థినులకు సమస్య ఎదురైనప్పుడు వారిలో ఆత్మస్థైర్యాన్ని కలిగించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జ్వాల (సెల్ఫ్ డిఫెన్స్) శిక్షణ కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఎస్పీ అఖిల్ మహాజన్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైరపర్సన్లు జిందం కళ, రామతీర్థపు మాధవి హాజరయ్యారు. ఈసందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ, మహిళల పరిరక్షణలో తెలంగాణ పోలీస్‌శాఖ అద్భుత ఫలితాలు సాధించిందన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వివిధ కార్యక్రమాలతో జిల్లా పోలీస్ యంత్రాంగం ముందుకు సాగుతుందన్నారు. దీనిలో భాగంగానే జ్వాల కార్యక్రమం ఏర్పాటు చేశామని, ఈ నెల 22 తర్వాత మహిళ మార్షల్ ఆర్ట్ మాస్టర్‌ను ఏర్పాటు చేసి జిల్లాలోని అన్ని కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థినులు, మహిళలకు ఆత్మరక్షణపై శిక్షణ ఇవ్వడానికి ప్రణాళికలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేష్, షీ టీమ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం రంగోలి పోటీల్లో మండల స్థాయిలో మొదట స్థానంలో నిలిచిన వారికి, వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చినవారికి పురస్కారాలు అందజేశారు.

తక్కువ ఖర్చుతో అత్యుత్తమ విద్య



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజగోపాల్

వేములవాడఅర్బన్: తక్కువ ఖర్చుతో అత్యుత్తమ సాంకేతిక విద్యనభ్యసించడానికి ఉత్తమ మార్గం పాలిటెక్నిక్ విద్య అని ప్రిన్సిపాల్ డా.బి.రాజగోపాల్ అన్నారు. జిల్లాలో పాలీసెట్ ర్యాంకులు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు పాలిక్వెస్ట్ పేరిట రెండు రోజుల అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని అగ్రహారం శ్రీరాజరాజేశ్వరస్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా తర్వాత వివిధ ప్రభుత్వ, ప్రైవేటు శాఖల్లో ఉద్యోగం సాధించవచ్చని పేర్కొన్నారు. ఈసెట్ ప్రవేశ పరీక్ష ద్వారా నేరుగా ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చన్నారు. పాలిటెక్నిక్ ద్వారా ఇంజినీరింగ్ విద్యతో మొత్తం ఆరేళ్ల సాంకేతిక పరిజ్ఞానం ఉంటుందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఆరేళ్లు పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రభాకరాచారి, కృష్ణ, మనోహర్, రాములు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ కౌంటింగ్‌లో ఎస్పీఎఫ్ సిబ్బంది చేతివాటం?

- గుట్టు చప్పుడు కాకుండా బదిలీ చేసిన అధికారులు
- ఆలస్యంగా వెలుగులోకి..

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో స్వామివారి ఆస్తులను కాపాడాల్సిన ఓ ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ తన దుర్బుద్ధితో చేతివాటం ప్రదర్శించిన అంశం ఆలస్యంగా వెలుగు చూసింది. ఈనెల 8న ఈవో కృష్ణప్రసాద్ పర్యవేక్షణలో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య స్వామివారి ఓపెన్‌స్లాబ్‌లో హుండీ లెక్కింపు జరిగింది. అయితే ఆలయ భద్రతా సిబ్బంది ఈ లెక్కింపునకు వచ్చే ఆలయ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను క్షుణ్ణంగా తనిఖీ చేసి హాల్లోకి అనుమతిస్తుంటారు. ఇంతేకాకుండా హుండీల్లోంచి డబ్బులు తీస్తుండగా, తీసిన సంచులను ఓపెన్‌స్లాబ్‌లోకి తరలిస్తుండగా, సంచుల్లోని డబ్బు లెక్కిస్తుండగా, నగలు, నగదు, బంగారం, వెండిని భద్రతా సిబ్బంది జాగ్రత్తగా పర్యవేక్షిస్తారు. అయితే ఇందులో ఓ కానిస్టేబుల్ గుట్టుచప్పుడు కాకుండా 4 గ్రాముల బంగారం దాచుకున్నట్లు బయటపడింది. దీంతో రంగంలోకి దిగిన స్థానిక ఎస్పీఎఫ్ ఇన్‌చార్జి అధికారి తమ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. విచారణ జరిపించిన అధికారులు తక్షణమే అతడిని బదిలీ చేసినట్లు సమాచారం. కంచె చేను మేసిందన్నట్లుగా స్వామివారి ఆస్తులకు రక్షణగా నిలవాల్సిన భద్రతా సిబ్బంది భక్షణ చేశారంటూ ఆలయ సిబ్బంది చర్చించుకుంటున్నారు.

కార్పొరేట్ వసతులు.. దీటైన ఫలితాలు



ఎల్లారెడ్డిపేట జెడ్పీ ఉన్నత పాఠశాల

- ఎల్లారెడ్డిపేట జెడ్పీహెచ్ఎస్‌లో ఏటేటా పెరుగుతున్న ఉత్తీర్ణత శాతం
- ప్రైవేట్ నుంచి మళ్లుతున్న విద్యార్థులు
- రూ.8కోట్లతో ఆధునిక భవనం పూర్తి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కార్పొరేట్ వసతులు.. ప్రైవేట్‌కు దీటైన ఫలితాలు.. డిజిటల్ విద్యాబోధన, ఫలితంగా ప్రైవేట్ నుంచి విద్యార్థులు సర్కార్ బడిబాట పడుతున్నారు. ఇటీవల పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఎల్లారెడ్డిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లితండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ఇందుకు నిదర్శనం ఈ విద్యాసంవత్సరం ప్రారంభంలో ప్రైవేట్ పాఠశాలల నుంచి 20 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారు. పచ్చని మైదానం, చుట్టూ ఆధునిక భవన సముదాయం, తరగతి గదులు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. దీనికి నాణ్యమైన బోధన తోడవడంతో విద్యార్థులను పాఠశాల వైపు ఆకర్షితులను చేస్తున్నాయి. రూ.8కోట్లతో నిర్మించిన ఆధునిక భవనంతో కార్పొరేట్‌స్థాయి వసతులు కల్పించి, ఫలితాల్లో సత్తాచాటడడంతో ప్రస్తుతం అందరి దృష్టి ఎల్లారెడ్డిపేట సర్కార్ పెద్దబడిపైనే పడింది.

డిజిటల్ తరగతులు

ఎల్లారెడ్డిపే జెడ్పీ ఉన్నత పాఠశాలలో పేద విద్యార్థులకు ఖరీదైన డిజిటల్ విద్య అందుతోంది. రూ.8కోట్లతో ఆధునిక భవన సముదాయాన్ని ఇటీవల నిర్మించారు. 50 కంప్యూటర్లతో డిజిటల్ ల్యాబ్, ఆధునిక సైన్స్ ల్యాబ్, లైబ్రరీ లాంటి వసతులు అందుబాటులోకి తెచ్చారు. విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా నీటిశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మోడర్న్ టాయిలెట్స్, చిన్న పిల్లలు ఆడుకునేందుకు వివిధ రకాల ఆటవస్తువులను అందుబాటులోకి తెచ్చారు.

ప్రైవేట్‌కు దీటుగా ఫలితాలు

జిల్లా వ్యాప్తంగా ఉన్న హైస్కూళ్లలో పదోతరగతి ఫలితాల్లో రెండు పది జీపీఏలు, ఒక 9.8 జీపీఏ సాధించి ఎల్లారెడ్డిపేట పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రస్తుతం ఈ బడిలో 301 మంది విద్యార్థులు చదువుతుండగా, ప్రైవేట్ నుంచి కొత్తగా 20 మంది విద్యార్థులు పాఠశాలలో చేరారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఇదే పాఠశాల సముదాయంలో నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలలో 170 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మరో అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా ఇదే సముదాయంలోకి మార్చారు. ఐదారేళ్ల క్రితం వసతులు లేక విద్యార్థుల సంఖ్య తగ్గి బోసిపోయిన పాఠశాల నేడు దాదాపు 500 మంది విద్యార్థులతో కళకళలాడుతూ సర్కార్ బడి చదువులమ్మ ఒడిగా మారింది.

డిజిటల్ బోధనతో..



డిజిటల్ బోధనతో పాఠ్యాంశాలపై సంపూర్ణ అవగాహన కలుగుతుంది. సైన్స్‌ల్యాబ్, లైబ్రరీ, కంప్యూటర్లతో అర్థమయ్యే పద్ధతిలో ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులు సైతం డిజిటల్ బోధనతో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.

– గాజుల కీర్తన, 8వ తరగతి

వసతులు బాగున్నాయి



ఆధునిక పాఠశాల అందుబాటులోకి రావడంతో అందులో వసతులు బాగున్నాయి. ప్రైవేట్ కంటే ఎక్కువ సౌకర్యాలతో విద్యాబోధన చేస్తున్నారు. ఆటవస్తువులు, పచ్చని మైదానంలో ఆటలు నేర్పుతున్నారు. మినరల్ వాటర్‌తో ఆరోగ్యంగా ఉంటున్నాం.

– వేల్పూరి చందు, 7వ తరగతి

ప్రైవేట్ నుంచి మా బడిలోకి..



గతంలో ప్రభుత్వ పాఠశాల నుంచి ప్రైవేట్‌కు విద్యార్థులు వెళ్లేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. ఇక్కడున్న వసతులు, విద్యార్థులు సాధించిన ఫలితాలను చూసి తల్లిదండ్రులు తమ పిల్లలను స్వచ్ఛందంగా పాఠశాలలో చేర్పిస్తున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభంలో ఇప్పటి వరకు ప్రైవేట్ నుంచి 20 మంది విద్యార్థులు చేరారు.

– దబ్బెడ హన్మండ్లు, హెచ్ఎం

క్లుప్తంగా

అదుపుతప్పిన కారు.. ఐదుగురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్ శివారులో ఓ కారు అదుపుతప్పి సాగునీటి కాల్వలోకి దూసుకెళ్లింది. స్థానికుల వివరాలు.. ఈ ప్రమాదంలో సిరిసిల్ల రూరల్ మండలం పెద్దూరుకు చెందిన ఐదుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను వెంకటాపూర్ గ్రామస్తులు ప్రైవేట్ వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ వారి వివరాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

వేములవాడ: వేములవాడ పట్టణంలోని గాంధీనగర్‌లో ఈనెల 10న కుమ్మరి కిషన్ అనే కార్మికుడు పిల్లర్ గుంతలు తవ్వుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు బండపై పడి తలకు బలమైన గాయమైంది. చికిత్స పొందుతూ మంగళవారం మరణించినట్లు కార్మిక సంఘం నాయకుడు కదారి రాములు తెలిపారు. కిషన్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. లేబర్ వెల్ఫేర్ నుంచి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని రాములు డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల నాయకులు కిషన్ మృతదేహానికి నివాళి అర్పించారు.

వివాహిత ఆత్మహత్య ఘటనపై కేసు

బోయినపల్లి(చొప్పదండి): అదనపు కట్నం వేధింపులకు తమ కూతురు ఆత్మహత్య చేసుకుందని వచ్చిన ఫిర్యాదు మేరకు భర్త, బావ, అత్త, ఆడపడచులు, తోటి కోడలుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ మంగళవారం తెలిపారు. వివరాలు.. వేములవాడ మండలం సంకెపెల్లి గ్రామానికి చెందిన నాగుల సింధు(22)కు బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామానికి చెందిన బాలగోని శ్రీనివాస్‌తో 15-03-2020న వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.4.50 లక్షలు కట్నం, 20 తులాల బంగారం, ఇతర కానుకలు ఇచ్చారు. వీరికి ఇద్దరు మగ సంతానం ఉన్నారు. కాగా కొద్దిరోజులుగా సింధును భర్త శ్రీనివాస్, బావ వెంకటేశం, అత్త వెంకవ్వ, ఆడపడచులు, తోటి కోడలు అదనపు కట్నం రూ.5 లక్షలు తీసుకురావాలని వేధిస్తున్నారు. వేధింపులు భరించలేక సింధు 10-04-2023న పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 12న రాత్రి మృతిచెందింది. మృతురాలి తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

నేటి నుంచి ఎస్సెస్సీ సప్లిమెంటరీ పరీక్షలు

సిరిసిల్లఅర్బన్: ఎస్సెస్సీ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు డీఈవో రమేశ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామని, సెల్‌ఫోన్లు, ఎలాక్ట్రానిక్ పరికరాలను కేంద్రంలోకి అనుమతించబోమని పేర్కొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షకు 96 మంది హాజరు

సిరిసిల్లక్రైం: జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన సెకండియర్ ఇంగ్లిష్ పరీక్షకు 96 మంది హాజరైనట్లు డీఐఈఓ మోహన్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 115 మంది పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 19 మంది హాజరుకాలేదని వెల్లడించారు.

చర్యలు తీసుకోవాలి

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలో ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రవేశాలు తీసుకుంటున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం డీఈవో రమేశ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్,కార్యక్రమంలో నాయకులు వేణు, అనిల్, రాకేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తమిద్దాం.. ప్రాణం నిలుపుదాం





- ఒక యూనిట్ రక్తంతో నలుగురికి ప్రాణం పోయొచ్చు
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

జగిత్యాల/సిరిసిల్లటౌన్/కోల్‌సిటీ(రామగుండం)/కరీంనగర్‌టౌన్/కరీంనగర్‌రూరల్/పెద్దపల్లిరూరల్: దాత ఇచ్చిన ఒక యూనిట్ రక్తం నలుగురికి ప్రాణం పోస్తుంది. రక్తదానం బాధితులకు, దాతలకు మధ్య బంధాలను ఏర్పాటు చేస్తుంది. అకస్మాత్తుగా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు లేదా అనారోగ్యానికి గురైనప్పుడు రక్తం అవసరం ఉంటుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలువురు దాతలు ఒక్క ఫోన్‌కాల్‌తో స్పందించి, రక్తదానం చేస్తున్నారు. యువతలో దీనిపై అవగాహన వచ్చింది. వాట్సాప్ గ్రూపుల్లో యాక్టివ్‌గా ఉంటూ ఎవరికి రక్తం అవసరమైనా వెళ్లి, ఇస్తున్నారు. బాధితుల ప్రాణాలు కాపాడుతున్నారు. కారల్ ల్యాండ్ స్టీనర్ అనే జీవ శాస్త్రవేత్త మానవ రక్తకణాలను కనుగొన్నందుకు గాను వైద్య శాస్త్రంలో 1930లో నోబెల్ బహుమతి లభించింది. ఆయన జయంతి గుర్తింపుగా రక్తం విలువను ప్రజలకు తెలియజేసేందుకు ఏటా జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా కథనం.

35 రోజులు భద్రపరచవచ్చు

ఒక మనిషి నుంచి రక్తాన్ని సేకరించి, 35 రోజుల వరకు భద్రపరచవచ్చు. ఆ తర్వాత అది పని చేయదు. కాగా, నాలుగు రకాల బ్యాగులను ఉపయోగించి, రక్తాన్ని సేకరించాల్సి ఉంటుంది. అనంతరం దాన్ని సింగిల్, డబుల్, ట్రిపుల్, క్వాడ్రిపుల్ బ్యాగులుగా విభజించి, భద్రపరుస్తుంటారు. అప్పుడు దాదాపు 120 రోజుల వరకు నిలువ చేయడానికి ఆస్కారం ఉంటుందని రక్తనిధి ప్రతినిధులు తెలిపారు.

వీరు రక్తదానం చేయొచ్చు

- 18 నుంచి 60 ఏళ్లలోపు వయసు, 45 కిలోల ఎక్కువ బరువుండి, రక్తంలో 12.5 గ్రాముల హిమోగ్లోబిన్ కంటే ఎక్కువ ఉన్నవారెవరైనా రక్తదానం చేయవచ్చని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.
- హెచ్‌ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్-బి, సి, బ్లడ్ కేన్సర్, హైబీపీ, క్షయ, మూర్ఛ, మత్తు పదార్థాలకు బానిసలైన వారు రక్తదానం చేయడానికి అనర్హులు. టాటూ వేసుకున్నవారు కూడా చేయొద్దు.
- రక్తదానం చేసి, 90 రోజులు దాటినవారు మళ్లీ చేయొచ్చు.

2 వేల మందితో వాట్సాప్ గ్రూప్



కరీంనగర్ మండలంలోని బొమ్మకల్‌కు చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు మంచికట్ల శ్రీనివాస్ 2 వేల మంది రక్తదాతలతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. ఆపదలో ఉన్నవాళ్లకు సకాలంలో రక్తదానం చేయించి, ఆదుకుంటున్నాడు. 2012లో స్నేహితులతో కలిసి స్పందన యువసేన అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన ఇప్పటివరకు 17 సార్లు రక్తదానం చేశా.

సిరిసిల్ల బ్లడ్‌బ్యాంకులో వసతులు

రాజన్నసిరిసిల్ల జిల్లా ఆస్పత్రిలోని బ్లడ్‌బ్యాంకులో రక్తదాతల కోసం మంత్రి కేటీఆర్ సహకారంతో సకల వసతులు కల్పించారు. అన్ని రోజుల్లో దాతల నుంచి రక్తం సేకరిస్తున్నారు. ఈ బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో ఇప్పటివరకు 112 రక్తదాన శిబిరాలు నిర్వహించారు. వీటిల్లో 6,774 మంది దాతలు రక్తదానం చేశారు. జిల్లాలోని రెడ్‌క్రాస్, రెడ్‌డ్రాప్, లయన్స్ క్లబ్ తదితర స్వచ్ఛంద సంస్థలు రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నాయి.

పెద్దపల్లి జిల్లాలో..

దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బుధవారం పెద్దపల్లి, మంథని ప్రభుత్వ ఆస్పత్రుల్లో, ఎన్టీపీసీలోని ధన్వంతరి ఆస్పత్రిలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ కావేటి రాజ్‌గోపాల్ తెలిపారు.

జగిత్యాల జిల్లాలో శిబిరాలు

జగిత్యాల జిల్లాలో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో ఒకటి, ప్రైవేటుగా నాలుగు(జగిత్యాలలో 3, మెట్‌పల్లిలో 1) రక్తనిధి కేంద్రాలున్నాయి. సర్కారు దవాఖానాలో ఉచితంగానే పేషెంట్స్‌కు అత్యవసరంగా రక్తం అందజేస్తారు. అంతేకాకుండా ఇక్కడి నుంచి మెట్‌పల్లి, కోరుట్ల, ధర్మపురి ఆస్పత్రులకు సైతం పంపిస్తుంటారు.

నేడు రాజ్‌భవన్‌లో 54వ సారి..



రక్తదానం చేస్తున్న రాజయ్య

పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేటకు చెందిన కొండేటి రాజయ్య ఇప్పటివరకు 53 సార్లు రక్తదానం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో 54వ సారి రక్తదానం చేయనున్నట్లు తెలిపారు. అక్కడే గవర్నర్ తమిళిసై చేతులమీదుగా ఆయన అవార్డు అందుకోనున్నారు.

3 వేల యూనిట్లు చేయించా



నేను పదేళ్లలో 48 సార్లు ప్లేట్‌లెట్స్, రక్తదానం చేశా. అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా ఫోన్ చేస్తే స్పందిస్తున్న. మా మిత్రులతో ఇప్పటివరకు 3 వేల యూనిట్లు రక్తదానం చేయించాను. సినీహీరో చిరంజీవి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న.

– గాలిపెల్లి కుమార్, బొమ్మకల్, కరీంనగర్

రక్తనిధికి పంపిస్తున్నం



సిరిసిల్ల పట్టణానికి చెందిన మా స్నేహితులతో కలిసి రెడ్ డ్రాప్ అనే సామాజిక సేవా సంస్థను నడిపిస్తున్నాం. ఇప్పటివరకు వందల మంది సభ్యులతో వేలాది మందికి రక్తదానం చేయించాం. రక్తదాన శిబిరాల ద్వారా రక్తాన్ని రక్తనిధి కేంద్రానికి పంపిస్తున్నం. రక్తం అవసరమున్నవారు 98859 75566 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలి.

– అస్లాం, రెడ్ డ్రాప్ ఫౌండేషన్ ప్రతినిధి, సిరిసిల్ల

ఎంతోమందిని కాపాడిన



అత్యవసర సమయాల్లో బాధితులకు రక్తదానం చేయాలి. నేను ఇప్పటివరకు 63 సార్లు చేసి, ఎంతోమంది ప్రాణాలు కాపాడిన. రక్తదాన దినోత్సవం సందర్భంగా బుధవారం గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న.

– తుమ్మనపల్లి బాలకృష్ణ, జగిత్యాల

ఆరోగ్యంగా ఉంటాం



రక్తదానం చేయడం వల్ల మనం ఆరోగ్యంగా ఉంటామన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలి. రక్తదానం చేస్తే ఇతరులకు సాయం చేశామన్న సంతృప్తి ఉంటుంది. యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలి.

– కావేటి రాజ్‌గోపాల్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్, పెద్దపల్లి

అపోహలు, భయం వద్దు



రక్తదానం చేయడంలో అపోహలు, భయం వద్దు. 20 నుంచి 60 ఏళ్ల వయసున్న ఆరోగ్యవంతులు, ప్రతీ మూడు నెలలకోసారి రక్తం ఇవ్వవచ్చు. ప్రజలను చైతన్యవంతులను చేయడానికి స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.

– డాక్టర్ బి.అమూల్ కుమార్, పాథాలజిస్టు, అసిస్టెంట్ ప్రొఫెసర్, గోదావరిఖని

పార్టీ ఆదేశిస్తే వేములవాడ నుంచి పోటీ

- బీఆర్ఎస్ నాయకుడు లక్ష్మీనర్సింహారావు

వేములవాడ: పార్టీ ఆదేశిస్తే వేములవాడ నుంచి పోటీ చేసేందుకు సిద్ధమని చల్మెడ లక్ష్మీనర్సింహారావు ప్రకటించారు. పట్టణంలోని రెండో బైపాస్‌రోడ్డు మల్లారం జంక్షన్‌లో తన కార్యాలయాన్ని ఏఎంసీ చైర్మన్ మిరియాల ప్రభాకర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు, అభిమానులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో పార్టీ ఆదేశిస్తే పోటీ చేస్తాననీ, అధిష్టానం పార్టీ టికెట్ రమేశ్‌బాబుకు ఇచ్చినా వారి గెలుపు కోసం కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు వేములవాడలో సొంత కార్యాలయం ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ తీగల రవీందర్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్యయాదవ్, గజానందరావు, తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రభాకర్‌రావు, లక్ష్మీనర్సింహారావు తదితరులు

ఉద్యమకారులను అక్కున చేర్చుకున్న చల్మెడ

తెలంగాణ ఉద్యమంలో పోరాటం చేసి జైలుకు వెళ్లి వచ్చిన ఉద్యమకారులను చల్మెడ లక్ష్మీనర్సింహారావు అక్కున చేర్చుకున్నారని జెడ్పీ మాజీ చైర్మన్ తీగల రవీందర్‌గౌడ్ అన్నారు. తాను బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చల్మెడ లక్ష్మీనర్సింహారావు సారథ్యంలో తన సహచరులతో కలసి పని చేయనున్నట్లు ప్రకటించారు. చల్మెడ వారందరినీ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ ఎటువైపు..?

వేములవాడరూరల్: వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మిర్యాల ప్రభాకర్‌రావు కొనసాగుతున్నారు. కాగా పట్టణంలో బీఆర్‌ఎస్‌కు చెందిన చల్మెడ లక్ష్మీనర్సింహారావు మంగళవారం ప్రారంభించిన వ్యక్తిగత పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంలో ప్రభాకర్‌రావు పాల్గొనడంతో మండలంలో జోరుగా చర్చ మొదలైంది. వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎందరో సీనియర్లు తమకు అవకాశం ఇవ్వాలని కోరినా ఎమ్మెల్యే రమేశ్‌బాబు సీనియర్‌గా మొదటి నుంచి పార్టీలో ఉంటున్న ప్రభాకర్‌రావుకు అవకాశం ఇచ్చారు. ప్రస్తుతం ఆయన చల్మెడ లక్ష్మీనర్సింహారావు కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొనడం చర్చకు దారి తీస్తోంది. కాగా మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు ఎవరూ పాల్గొనలేదని తెలిసింది. చైర్మన్ ఒక్కరే పాల్గొనడంతో వేములవాడ, కోనరావుపేట మండలాల్లో జోరుగా చర్చించుకుంటున్నారు.

సైబర్ నేరస్తుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: సిమెంట్ వ్యాపారం పేరిట ఆన్‌లైన్‌లో టోల్‌ఫ్రీ నంబర్ పెట్టి తద్వారా లక్షల రూపాయలు మోసం చేసిన అంతర్రాష్ట్ర సైబర్ నేరస్తుడిని మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాలు వెల్లడించారు. బిహార్ రాష్ట్రం నలంద జిల్లా కత్రిసరాయి పోలీస్‌స్టేషన్ పరిధి బగ్వాన్‌పూర్‌కు చెందిన కుందన్‌కుమార్ తొమ్మిదో తరగతి వరకు చదివాడు. తను నివాసముండే ప్రాంతంలో పలువురు కంప్యూటర్ కోర్సు చేసిన ఆన్‌లైన్‌లో అధిక డబ్బులు సంపాదించినట్లు తెలుసుకున్నాడు. చిన్ననాటి నుంచి జల్సాలకు అలవాటుపడిన కుందన్ ఆన్‌లైన్‌లో మోసాలు చేసి మరింత జల్సాగా బతకాలని భావించాడు. ఓ సిమెంట్ కంపెనీ పేరు, టోల్‌ఫ్రీ నంబర్‌ను నకిలీ వెబ్‌సైట్‌లో నమోదు చేశాడు. ఈక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లికి చెందిన ఉత్తం అంజయ్య తనకు నాన్‌గ్రేడ్ సిమెంట్ కావాలని వెబ్‌సైట్‌లో వెతకగా కుందన్ ఏర్పాటు చేసిన నకిలీ టోల్‌ఫ్రీ నంబర్ కనిపించింది. దానికి ఫోన్ చేసి సిమెంట్ కావాలని అంజయ్య ఆర్డర్ పెట్టాడు. 640 బస్తాలకు ముందుగా ఆర్డర్ చేసి మే 9న రూ.1.96 లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేశాడు. మరుసటి రోజు సిమెంట్ రాలేదని అంజయ్య, కుందన్‌కు ఫోన్ చేయగా, మరో 340 బస్తాలు ఆర్డర్ చేస్తే లాభం ఉంటుందని నమ్మబలికాడు. దీనిని నమ్మిన బాధితుడు మే 10న రూ.95,400 బ్యాంకులో జమ చేశాడు. తర్వాత మరుసటి రోజు మళ్లీ సిమెంట్ గురించి ఫోన్ చేస్తే గతంలో పంపినవాటికి అదనంగా మరో రూ.11 వేలు బ్యాంకులో వేయాలని కుందన్ తెలపడంతో ఇదంతా తేడాగా ఉందని బాధితుడు వీర్నపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఎల్లారెడ్డిపేట సీఐ మొగిలి ఆధ్వర్యంలో సైబర్ సెల్ ఎస్సై జునైద్, ఎస్సై శ్రీకాంత్, కానిస్టేబుల్ నయిమ్‌లతో స్పెషల్ టీమ్ ఏర్పాటు చేసి ఆధునిక సాంకేతికత ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. కుందన్ బీహార్‌లోని నలంద జిల్లా చమర్ గ్రామంలో ఉన్నాడన్న సమాచారంతో అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రూ.2 లక్షలు, మూడు మొబైల్ ఫోన్స్, 6 సిమ్ కార్డ్స్, బ్యాంక్ పాస్ బుక్స్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వివరించారు.

అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దు

- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల: జిల్లాలో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని, అలసత్వం ప్రదర్శించవద్దని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. పెండింగ్ పనులపై మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. రగుడు నుంచి విద్యానగర్ కొండా లక్ష్మణ్ బాపూజీ కూడలి వరకు నాలుగు వరసల రహదారిపై డివైడర్ మధ్యలో ప్లాంటేషన్ పూర్తి చేయాలన్నారు. ఈ నెల 19లోగా 'మన ఊరు– మన బడి'లో నిర్మించిన పనులను పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో టి.శ్రీనివాస్‌రావు, డీఎఫ్‌వో బాలమణి, వేములవాడ ఆర్డీవో పి.పవన్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యామ్‌సుందర్, డీపీవో రవీందర్, డీఈవో రమేశ్, ×సెస్‌*ి ఎండీ రామకృష్ణ, మిషన్ భగీరథ ఈఈ జానకి, జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదాలను నివారించాలి

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో ఎస్పీ అఖిల్ మహజన్‌తో కలిసి జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే చేరుకునేలా జిల్లా ఆస్పత్రిలో ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల పార్కింగ్‌కు స్థలాలు గుర్తించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. జిల్లా రవాణా అధికారి వై.కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎం సహాయనిధి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వం అమలు చేస్తున్న సీఎం సహాయనిధి పథకం ఆపద సమయంలో నిరుపేదలకు వరంగా మారిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను మంగళవారం ఎల్లారెడ్డిపేటలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆగయ్య మాట్లాడుతూ, రాజకీయాలకు అతీతంగా సీఎం కేసీఆర్ పెద్ద మనసుతో అందరికీ పథకాన్ని వర్తింపజేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి రేణుక, సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రెండు గ్రామాలకో సబ్‌స్టేషన్



స్థలాన్ని పరిశీలిస్తున్న రామారావు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రానున్న రోజుల్లో రెండు గ్రామాలకో సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. మండలంలోని బండలింగంపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు మంగళవారం స్థల పరిశీలన చేశారు. జిల్లాలోని సెస్ పరిధిలో ప్రస్తుతం 33/11 సబ్‌స్టేషన్లు 76 ఉండగా కొత్తగా మరో 30 ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సెస్ పరిధిలో ఆరు 132/33 సబ్‌స్టేషన్లు ఉండగా మరో 2 బోయినపల్లి, తంగళ్లపల్లి మండలం నేరేళ్లలో ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు చేసినట్లు వివరించారు. అలాగే కొత్తగా ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి, సిరిసిల్ల, వేములవాడ, నాంపల్లిల్లో సబ్‌డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ వరుస కృష్ణహరి, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ ఏడీ తదితరులు ఉన్నారు.

పనులు ప్రారంభం

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని గర్జనపల్లి గ్రామంలో విద్యుత్ లూజు వైర్ల మరమ్మతు పనులను సెస్ చైర్మన్ రామారావు ప్రారంభించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. డైరెక్టర్లు మల్లేశం, కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యాలయాలతో రైతు వేదికల అనుసంధానం



బ్యాంకు భవనం ప్రారంభిస్తున్న వినోద్‌కుమార్, రవిశంకర్, రవీందర్‌రావు తదితరులు

బోయినపల్లి(చొప్పదండి): రైతువేదికలను రాబోయే రోజుల్లో వ్యవసాయ విశ్వవిద్యాలయాలతో అనుసంధానం చేయనున్నట్లు ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలో కేడీసీసీ బ్యాంకు నూతన భవనాన్ని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, నాస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో వ్యవసాయ విశ్వవిద్యాలయాలను రైతువేదికలతో అనుసంధానిస్తే రైతుల పంటల సాగు, చీడపీడల నివారణ అంశాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులతో నేరుగా ఆన్‌లైన్‌లో మాట్లాడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం రవీందర్‌రావు మాట్లాడుతూ, తెలంగాణ ఏర్పడక ముందు రూ.6 వేల కోట్ల వ్యాపారం చేసిన సహకార బ్యాంకులు రాష్ట్రం వచ్చాక 9 ఏళ్లలో రూ.19 వేల కోట్ల వ్యాపారానికి చేరిందన్నారు. ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడుతూ, గతంలో అంజుమన్ బ్యాంకులు రైతులను పీల్చుకు తినేవని సీఎం కేసీఆర్ వచ్చాక సహకార బ్యాంకులు దేశానికి దిక్సూచిగా మారాయన్నారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ డైరెక్టర్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, వుచ్చిడి మోహన్‌రెడ్డి, రమేశ్, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, సర్పంచు గుంటి లతశ్రీ, ఎంపీటీసీ సంబ బుచ్చమ్మ, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్రామారావు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో పవర్‌లూం కార్మికుడి మృతి



షరీఫ్ (ఫైల్)

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల పట్టణం సుభాష్‌నగర్‌కు చెందిన పవర్‌లూం కార్మికుడు మహమ్మద్ షరీఫ్(55) మంగళవారం వడదెబ్బతో మృతి చెందాడు. కుటుంబీకుల వివరాలు.. షరీఫ్ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు పని కోసం నెహ్రూనగర్‌కు సైకిల్ పై బయలుదేరాడు. ఈక్రమంలో నెహ్రూనగర్‌లోని చౌరస్తా వద్ద పడిపోగా స్థానికులు 108కు సమాచారం. 108 సిబ్బంది అతడిని పరిశీలించి చనిపోయాడని నిర్ధారించారు. మృతుడికి భార్య ఫర్జానా, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. వీరిలో ఇద్దరికి వివాహం కాగా మరొకరు దివ్యాంగురాలు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.